సాక్షి
చిత్తూరు
బుధవారం । 31 । జనవరి । 2024



ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు
ప్రతి అభివృద్ధి పనిని ప్రణాళికగా చేపడుతున్నట్లు వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి తెలిపారు. - 8లో



రెండు నెలలుగా వెంపర్లాట..
2 నెలల కిందట కుదువ వ్యాపార దుకాణాన్ని మూసేసిన ఓ వ్యాపారి చివరకు తన దుకాణం వద్దే పోలీసులకు పట్టుబడ్డాడు. - 8లో



తెలుగు తమ్ముళ్ల ఓవర్‌యాక్షన్
చిత్తూరులో అనుమతి లేకుండా ప్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న టీడీపీ నేతలను అధికారులు అడ్డుకోవడంతో ఓవర్‌యాక్షన్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

2న నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ జాషువా

చిత్తూరు అర్బన్: చిత్తూరు నూతన ఎస్పీగా నియమితులైన పీ.జాషువా ఫిబ్రవరి 2న బాధ్యతలు తీసుకోనున్నారు. కృష్ణా జిల్లాలో ఎస్పీగా పనిచేస్తున్న ఆయన చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు నూతన ఎస్పీ శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం.

12 స్కూళ్లకు గ్రీన్‌స్కూల్ అవార్డులు



జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్: గ్రీన్‌స్కూల్ ప్రోగ్రాంలో ఉత్తమ ప్రదర్శన వహించినందుకు గానూ ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా 12 పాఠశాలలు జాతీయ స్థాయి గ్రీన్‌స్కూల్ అవార్డులకు ఎంపికయ్యాయి. ఈ స్కూళ్లకు చెందిన టీచర్లు 30వ తేదీన మంగళవారం ఢిల్లీలో అవార్డులు అందుకున్నారు. ఉత్తమ హరిత విభాగంలో 12 స్కూళ్లు ఎంపిక కాగా, ల్యాండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి జెడ్పీ హైస్కూల్ పాఠశాల ఎంపికైంది. ఆయా పాఠశాలల్లో పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చి మొక్కలు విరివిగా పెంచినందుకు గాను ఈ అవార్డులను కేంద్రం అందజేసింది. చిత్తూరు జిల్లా నుంచి తవణంపల్లి, వెదురుకుప్పం, కల్లూరు హైస్కూళ్లు, తిరుపతి జిల్లా నుంచి నారాయణవనం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, పాలమంగలం జెడ్పీ హైస్కూల్ ఎంపికయ్యాయి. నేషనల్ గ్రీన్‌కోర్ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ, సంబంధిత పాఠశాలల నుంచి రవీంద్రరెడ్డి, కిషోర్, నందకుమార్, వెంకట సిద్ధులు అవార్డులను స్వీకరించారు. వారికి చిత్తూరు డీఈఓ విజయేంద్రరావు, తిరుపతి డీఈఓ శేఖర్ అభినందించారు.

పట్టురైతుకు స్వీర్ అవార్డు



స్వీర్ అవార్డును అందుకుంటున్న పట్టురైతు గురుమూర్తి

పలమనేరు: పట్టురైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉండే పట్టుగూళ్లను విడిపించే యంత్రాన్ని తయారుచేసి దాన్ని మార్కెటింగ్ చేస్తున్న నియోజకవర్గంలోని ఏడూరు గ్రామానికి చెందిన పట్టురైతు గురుమూర్తిని స్వీర్(శ్రీ వేంకటేశ్వర ఎమినెంట్ ఎంటర్‌ప్రైజ్ రికగ్నేషన్) అవార్డు వరించింది. ఈ మేరకు తిరుపతి ఎస్వీయూలో మంగళవారం జరిగిన మోస్ట్ ప్రామిసింగ్ అగ్రి స్టార్టప్ 2023-24 కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ మొహ్మద్ హుసేన్, అగ్రి బిజినెస్ ఇంకుబేటర్ డా.బాలహుసేన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కుకూన్ హార్వెస్టర్ పేరిట కూలీలతో పనిలేకుండా పట్టుగూళ్లను విడిపించే యంత్రాన్ని గురుమూర్తి రూపొందించిన విషయం తెలిసిందే.



ఓటు హక్కు మనకు వజ్రాయుధం. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ. ఓటుతోనే మంచి పాలకులను ఎన్నుకోగలం. ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వంటిది కూడా. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు.



ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జిల్లాలో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు : 7
పుంగనూరు, నగరి, జీడీనెల్లూరు(ఎస్సీ), చిత్తూరు, పూతలపట్టు (ఎస్సీ), పలమనేరు, కుప్పం

ఓటర్ల వివరాలు..

మొత్తం ఓటర్లు	15,56,777 మంది
పురుషులు	765443
మహిళలు	788180
ట్రాన్స్‌జెండర్లు, ఎన్ఆర్ఐలు, సర్వీస్ ఓటర్లు	3154 మంది
మొత్తం పోలింగ్ కేంద్రాలు	1762
పట్టణాల్లో	362
గ్రామాల్లో	1400

ఓటే వజ్రాయుధం

- సాధారణ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం
- చిత్తూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు, 1 ఎంపీ నియోజకవర్గం
- 15,56,777 మంది ఓటర్లు, 1762 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల నిర్వహణకు ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, సిబ్బంది నియామకం
- జిల్లాలో 25 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టుల ఏర్పాటు
- నోటిఫికేషన్ వచ్చే వరకు ఓటు నమోదుకు అవకాశం
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	2024	2019	పెరిగిన ఓటర్లు
పుంగనూరు	116560	121124	425	238109	229261	8848
నగరి	98060	103329	168	201557	194748	6809
జీడీ నెల్లూరు	101669	102871	496	205036	199405	5631
చిత్తూరు	97709	102952	476	201137	193089	8048
పూతలపట్టు	108351	111534	1119	221004	215183	5821
పలమనేరు	132010	134689	245	266944	255870	11074
కుప్పం	111084	111681	225	222990	213146	9844
మొత్తం	765443	788180	3154	1556777	1500702	56075



యువతికి ఓటరుకార్డు అందజేస్తున్న కలెక్టర్

సాక్షి, చిత్తూరు: త్వరలో జరిగే సాధారణ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే సర్వం సిద్ధం చేసింది. ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో మొత్తం 1556777 మంది ఓటర్లు ఉండగా, ఈసారి కొత్తగా 56,075 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు.

648 సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో ఎన్నికల సందర్భంగా గత అనుభవాలు, సంఘటనల నేపథ్యంలో ఈసారి మొత్తం 648 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇందులోనూ 233 సాధారణ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 415 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా నిర్ధారించారు.

ఏడుగురు ఆర్‌ఓల నేతృత్వంలో..

ఈసారి సాధారణ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడుగురు ఆర్‌ఓలు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. 40 మంది ఏఆర్‌ఓలు, ఆర్‌ఈఆర్‌ఓలు, 223 మంది సెక్టార్ అధికారులు, 1267 మంది మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించనున్నారు. వీరితో పాటు 2,114 మంది ప్రిసైడింగ్ అధికారులు, 10572 మంది పోలింగ్ అధికారులు, 1762 బీఎల్‌ఓలు, 16 మంది నోడల్ అధికారులు, డీఎల్ఎంటీలు 10మంది, 49 మంది ఏఎల్ఎంటీలు ఎన్నికల్లో సేవలు అందించనున్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు..

చిత్తూరు జిల్లాకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు సరిహద్దుగా ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఈ రెండు రాష్ట్రాల నుంచి మద్యం, నగదు, ఓటర్లను మభ్య పెట్టే వస్తువులు అక్రమంగా సరిహద్దులు దాటి జిల్లాలోకి ప్రవేశించకుండా 25 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే జిల్లాలో నిర్దేశిత ప్రాంతాల్లో మరో 38 అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు.

ఓటు వినియోగించుకునే అవకాశం..



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అతి విలువైంది. ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా ప్రతి ఎన్నికల్లో ఓటు వేశాను. ప్రస్తుతం నా వయసు 86 ఏళ్లు. నేను తపోవనం ఆశ్రమంలో ఉంటా. రానున్న ఎన్నికల్లో సీనియర్ ఓటర్లకు అంటే 80 ఏళ్ల పైబడిన వారు ఉన్న స్థలంలో నుంచి ఓటు హక్కును కల్పించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. సీనియర్ ఓటర్ల ఓట్లు పోలవుతాయి. ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నా.
– నారాయణస్వామి, సీనియర్ ఓటరు, చిత్తూరు

ఓటు వినియోగించుకుంటా



ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ప్రజాస్వామ్యంలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే హక్కు ఉంది. ఓటు పొందాల్సిన అవసరం కూడా ప్రతి ఒక్కరికీ ఉంది. నేను స్వచ్ఛందంగా నా ఓటును దరఖాస్తు చేసుకున్నా. ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పించింది. రానున్న ఎన్నికల్లో మొదటిసారిగా ఓటును వేయనున్నా. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును సద్వినియోగం చేసుకుని సరైన నాయకున్ని ఎన్నుకుంటా.
– శ్రీనివాసులు చిగరపల్లి, ఐరాల మండలం

నోటిఫికేషన్ వచ్చే వరకు అవకాశం



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో సజావుగా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తాం. ఇందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేశాం. కావాల్సిన సిబ్బంది నియామకానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సాగుతున్నాయి. నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పిస్తాం. ఈ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నోటిఫికేషన్ వచ్చే వరకు అర్హులైన వారికి ఓటర్లుగా నమోదు చేసే కార్యక్రమం కొనసాగుతుంది.
– ఎస్.షణ్మోహన్, జిల్లా కలెక్టర్, చిత్తూరు

చదువుల విప్లవం ఘనత సీఎం జగనన్నదే



నూతన ఐటీఐ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా



ఐటీఐ కళాశాల భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి రోజా నాయకులు, కార్యకర్తలు, అధికారులు

- శంకుస్థాపన చేసిన ఏడాదిలోపే ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రారంభం చేయడం ఆనందంగా ఉంది
- అభివృద్ధి అంటేనే సీఎం జగన్
- రూ.5.70 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఐటీఐ కళాశాల నిర్మాణం
- మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం (నగరి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని దేశానికి పరిచయం చేస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చదువుల విప్లవం తీసుకొచ్చారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. విజయపురం మండలం మాధవరం పంచాయతీ ఎల్లసముద్రం గ్రామంలో సుమారు రూ.5.70 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ఐటీఐ కళాశాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నాయకులు ఉన్నారని, అలాగే చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పని చేశారని, అయినా ఎవరూ సాధించలేదని ఘనత ఈ రోజు జగనన్న ప్రభుత్వంలో సాధించామని ఆమె అన్నారు. శంకుస్థాపన చేసిన ఏడాదికే భవనాన్ని పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే, చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి, తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నూతన భవన నిర్మాణం చేపట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఐటీఐ చదివితే ఉపాధి గ్యారెంటీ

ఇంజినీరింగ్ చదివేవాళ్లకు ఉద్యోగం రావడం ఆలస్యం కావొచ్చేమో కానీ, ఐటీఐ చదివిన వాళ్లకు ఏదో ఒక కంపెనీ, ఫ్యాక్టరీ, ఇండస్ట్రీల్లో కచ్చితంగా ఉద్యోగ అవకాశం లభిస్తుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గడిచిన 5 ఏళ్లలో ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ రోజు కేజీ నుంచి పీజీ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు ఉచితంగా విద్యను అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందన్నారు. ఈ దేశంలో విద్యకు మొదటి ప్రాధ్యాన్యత ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అని ఆమె కొనియాడారు.

ప్రతిపక్షానికి సవాల్..

అభివృద్ధి జరగలేదన్న టీడీపీ నాయకులారా మీరు ఏ గ్రామానికైనా రండి 2019కి ముందు 2019 తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా జరిగిందో చూపిస్తామని మంత్రి ఆర్‌కే రోజా సవాల్ విసిరారు. నియోజకవర్గంలో తాము వేసినన్ని రోడ్లు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, ఆర్బీకేలు ఎవరైనా కట్టించారా ? అని ప్రశ్నించారు. ఇలాంటి అభివృద్ధి చేసిన జగనన్నను మళ్లీ సీఎంగా చూడాలని ప్రజలు ఆసక్తితో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, జెడ్పీటీసీ రేవతి, ఎంపీటీసీ రాజగోపాల్, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు విద్య, బాబు, మండల అధ్యక్షుడు గోపి, కో–ఆప్షన్ మెంబర్ రాజేంద్రన్, రవినాయుడు, హరినాయుడు, జిల్లు, అంగముత్తు, రామరాజ్, హరి, ఏడీ ఆనందరావ్, ఈఈ లక్ష్మీపతిరెడ్డి, ప్రిన్సిపల్ గణేష్, డీఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల భాగస్వామ్యంతో మరింత పటిష్టం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన కొత్తగా నియమితులైన మైనారిటీ సెల్ నేతలు



మంత్రి పెద్దిరెడ్డితో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సిద్ధిక్

పుంగనూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ముస్లిం మైనారిటీలకు పదవులు కేటాయించామని, వారి భాగస్వామ్యంతో పార్టీని మరింత పటిష్ట పరుస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పీఎస్ సిద్దిక్‌ను, అలాగే చిత్తూరు జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఇర్ఫాన్‌కు, మైనారిటీ సెల్ కార్యదర్శిగా అహమ్మద్‌ను నియమించారు. మంగళవారం వారికి మంత్రి నియామకపు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అగ్రస్థానం కల్పించామన్నారు. పార్టీలో వారికి అనేక పదవులు కేటాయించి, వారి సహకారంతోనే పార్టీని పటిష్టం చేస్తామన్నారు. సీమజిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



ఈ ఏడాది 12 మంది ఉద్యోగ విరమణ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్, కార్యాలయాల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్లు 12 మంది ఈ ఏడాదిలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ మేరకు ఉద్యోగ విరమణ పొందనున్న తహసీల్దార్ల జాబితాను రాష్ట్ర సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవి కలెక్టరేట్‌కు చేరాయి.



రహదారి భద్రత జీవితానికి రక్షణ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీసీ నిరంజన్‌రెడ్డి


చిత్తూరు రూరల్: రహదారి భద్రత జీవితానికి రక్షణ అని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం స్కూల్ బస్సు డ్రైవర్లకు, ప్రైవేటు స్కూల్ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ బస్సు డ్రైవర్లు రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. నిత్యం డ్యూటీ ఎక్కే ముందు బస్సు కండీషన్‌ను పరీక్షించుకోవాలని సూచించారు. పిల్లలను బస్సు ఎక్కించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, సురక్షితంగా గమ్యానికి చేర్చాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించి వాహనం నడిపితే కేసులు తప్పవన్నారు. ముఖ్యంగా పాఠశాల యజమానులు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేనివారికి వాహనం ఇవ్వొద్దని పదేపదే సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆపై జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రాజేశ్వర్‌రావు, వాసుదేవారెడ్డి, దీపిక, ప్రసాద్ వర్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సీఐలకు స్థానచలనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్ ఇస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న పి.సుబ్బరామిరెడ్డిని నగరికి, ఎం.రాజగోపాల్‌ను పాకాలకు, నగరిలో పనిచేస్తున్న శ్రీనివాసంతిని చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తిరుపతి జిల్లాలో గూడూరు టూటౌన్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వరరావును గుంటూరు వీఆర్‌కు, గుంటూరు వీఆర్‌లో పనిచేస్తున్న రవికిరణ్‌ను గూడురు టూటౌన్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సవరణ

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సవరణ చేస్తూ ఆ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రయవిక్రయదారుల నుంచి చివరి వేలిముద్ర స్వీకరణ ఇక అవసరం లేదని పేర్కొన్నారు. అన్నిరకాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఫొటోలు, వారి ఆధార్ నంబర్ల ఆధారంగా దస్తావేజు తయారు చేసి, ఈకేవైసీ ద్వారా క్రయవిక్రయదారులు వేలిముద్రలు తీసుకుంటారు. వాటిని ఆన్‌లైన్‌లో సబ్‌రిజిస్ట్రార్ పరిశీలించి దానిపై ఈ–సైన్ చేస్తారు. చివరిగా సబ్ రిజిస్ట్రార్ ఎదుట క్రయవిక్రయదారులు మ్యానువల్‌గా వేలిముద్రలు వేసి దాంతో పాటు ఇరువురు సాక్షులు దస్తావేజు చివరిపేజీలో సంతకాలు చేయడంతో రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తవుతుంది. తొలిసారి ఈకేవైసీలో వేసిన వేలిముద్ర అన్నింటికీ సరిపోతుందని, సబ్ రిజిస్ట్రార్ సమక్షంలో మరోసారి వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదంటూ చట్టంలో సవరణ చేశారు.



క్లుప్తంగా

కంటైనరును ఢీకొన్న ఆర్టీసీ బస్సు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సీఐ నాగరాజరావు చెప్పిన వివరాలు ఇలా.. తిరుమల నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని బోడబండ్ల క్రాస్ సమీపంలో ముందు వెళ్తున్న కంటైనరును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 ద్వారా బంగారుపాళెం, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. బంగారుపాళెం ఆస్పత్రిలో నంగిలికి చెందిన శివప్ప, బంగారుపాళెం శాంతినగర్‌కు చెందిన శంకర్ శెట్టి, తగ్గువారిపల్లెకు చెందిన శ్యామల, సరళ, పెనుమూరుకు చెందిన రాజేంద్రబాబు చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు చిత్తూరులో చేరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

తెలుగు తమ్ముళ్ల ఓవర్‌యాక్షన్

- అనుమతి లేకనే పచ్చ సిమెంట్ దిమ్మెల ఏర్పాటు
- అభ్యంతరం తెలిపిన అధికారులు
- చిత్తూరులో ప్రభుత్వ అధికారులపై టీడీపీ నేతల రుబాబు


కమిషనర్‌ను అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్: 'ఎన్ని దినాలు మీ ఆటలన్నీ.. ఇంక అరవై రోజులే.. మళ్లీ ఏం చేస్తారో చూస్తాం.. ఒక్కరినీ వదిలిపెట్టాం.. మీ అంతు చూస్తాం' అని నగరపాలక సంస్థ అధికారులపై టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. సాకులు వెతికి మరీ భయపెట్టాలని చూశారు. చెరువు కట్ట మీ అడ్డా కాదంటూ ఊగిపోయారు. వీరి అరుపులకు అధికారులు ఎంతకీ తగ్గకపోవడంతో రూల్స్ అంటూ తమ్ముళ్లు ఆంగ్లలో అరుపులు మొదలెట్టారు. చివరికి అనుమతితోనే బెంచ్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని పోలీసులు, అధికారులు స్పష్టం చేయడంతో మెల్లగా తమ్ముళ్లు కట్ట నుంచి తప్పుకున్నారు. చిత్తూరు నగరం కట్టమంచి చెరువు కట్ట మీద మంగళవారం టీడీపీ నాయకులు అనధికారికంగా బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ బెంచులకు పచ్చ రంగు వేసి దిమ్మెలను పాతారు. ఇది తెలుసుకున్న కమిషనర్ అరుణ అధికారులతో కలిసి చెరువు కట్ట వద్దకు వెళ్లారు. అనుమతి తీసుకుని ఇక్కడ బెంచులు ఏర్పాటు చేసుకోవాలని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ నాయకులు ఆమెను అడ్డుకున్నారు. బెంచ్‌లు తీయడం కుదరంటూ వాగ్వివాదానికి దిగారు. విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకుని, అనుమతితో బెంచ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయినా వారు తమకు ఎలాంటి అనుమతులు వద్దని, బెంచ్‌లను తీసే ప్రసక్తే లేదంటూ ఓవర్ యాక్షన్ చేశారు. ఇంతలో టీడీపీ నేత దొరబాబు, మరి కొంతమంది నాయకులు అక్కడికి చేరుకుని రాద్ధాంతం చేశారు. అధికారులను మాటలతోనే భయపెట్టాలని చూశారు. మరోనేత అయితే ఏకంగా అంతు చూస్తామంటూ అధికారులపై రెచ్చిపోయాడు. సీఐ విశ్వనాథరెడ్డి రంగ ప్రవేశం చేసి సమస్యను సద్దుమణిగించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి అనుమతి తీసుకోవాలని సూచించారు. చివరకు డీఎస్పీ శ్రీనివాసమూర్తి రంగప్రవేశం చేసి దిమ్మెల ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతి ఉండాలని స్పష్టం చేయడంతో తెలుగు తమ్ముళ్లు తోకముడిచారు.

నాణ్యత లేని దిమ్మెలు..

చెరువు కట్ట చుట్టూ అనధికారికంగా టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన బెంచ్‌లు సిమెంట్‌తో తయారు చేసినవి. నాణ్యత లేకపోవడంతో పట్టుకుంటే పండిపోయేలా ఉన్నాయి. ఇలాంటి నాణ్యత లేని బల్లలపై ప్రజలు కూర్చున్నా కూడా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాగా టీడీపీలోని మరోవర్గం కూడా దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. సొంత ప్రచారం కోసం పార్టీని వాడుకుంటున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

నీ అంతు చూస్తాం: 'చిన్నయ్యా నువ్వు నా మదిలో ఉన్నావ్.. ఇంకా 72 రోజులే ఉంది. నీ అంతు చూస్తా' మాజీ కార్పొరేటర్ భర్త, టీడీపీ నాయకుడు యువరాజులు నాయుడు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న దళిత అధికారి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్యను బెదిరించాడు. చిత్తూరు నగరం, కట్టమంచి చెరువు చుట్టూ టీడీపీ నాయకులు మంగళవారం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా బెంచీలు ఏర్పాటుపై కార్పొరేషన్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో అక్కడున్న చిన్నయ్యను ఆ టీడీపీ నేత నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. 72 రోజుల్లో నీ అంత చూస్తానని బెదిరిస్తూ చిన్నయ్య పైపైకి దూసుకెళ్లాడు. పలుమార్లు ఇలానే బెదిరించడంతో చిన్నయ్య వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి. దీనిపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

> **పర్మిషన్ లేకుంటే ఎలా ?**
>
> రాజకీయ పార్టీలకు సంబంధించిన పేర్లు ముద్రించుకుని, ఆ పార్టీ రంగులు వేసిన దిమ్మెలను, ఇతర వస్తువులను ప్రజల సౌకర్యార్థం కోసం అని పెట్టేటప్పుడు తప్పనిసరిగా కార్పొరేషన్ అధికారుల నుంచి అనుమతి తీసు కోవాలి. ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు పెడతామంటే కుదరదు. దీనిపై కార్పొరేషన్ అధికారులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలే తప్ప.. అధికారులపై తిరగబడడం మంచిది కాదు. మరోసారి ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా.
>
> **- డాక్టర్ అరుణ, కమిషనర్, చిత్తూరు కార్పొరేషన్**

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

- రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి


రోడ్డు పనులు పరిశీలిస్తున్న రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి

నగరి : నియోజకవర్గంలో చేపట్టే ప్రతి పనీ ప్రజాహితంగానే మంత్రి ఆర్కేరోజా చేపడుతున్నారని ఆమె భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి అన్నారు. మంగళవారం కుశస్థలీ నదిపై ఉన్న లోతట్టు వంతెన వరదనీటికి ఛిద్రం కావడంతో తాత్కాలికంగా మట్టిరోడ్డును ఏర్పాటు చేసిన ప్రాంతంలో పక్కాగా తారురోడ్డు నిర్మించే పనులను, మున్సిపల్ బస్టాండును ఆధునీకరించే పనులను, సంతమైదానంలో నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి ఆర్కేరోజా ప్రతి పనిని పక్కాగా, ప్రణాళికాత్మకంగా చేస్తున్నారన్నారు. ప్రజాహితంగానే ప్రతి పనీ జరుగుతున్నట్లు చెప్పారు. కీళపట్టు మార్గంలో ఇదివరకే యుద్ధప్రాతిపదికన తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం తారు రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. అలాగే నగరి ప్రజల ఎన్నో రోజుల కల అయిన మున్సిపల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. మున్సిపల్ బస్టాండ్‌కు మరమ్మతులు చేసి రంగులు వేసి ఆధునీకరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, యాకోబు, మురుగ, బిలాల్, అమర్, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఆదిమూలం క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం క్షమాపణలు చెప్పాలని పూతలపట్టు ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బంగారుపాళెంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థిత్వం మార్పు చేయడంపై ఆదిమూలం పెద్దిరెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అతన్ని గౌరవించి తిరుపతి ఎంపీ సీటు కేటాయించారని, కానీ ఎవరో చేసిన ప్రలోభాలకు తలవంచిన ఆదిమూలం మంత్రి పెద్దిరెడ్డిపై అవాకులు చవాకులు పేలడాన్ని తీవ్రంగా ఖండించారు. తిరుపతిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కూడా ఆయన కుమారుడు సుమన్ మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్లే తాము రాజకీయంగా ఈస్థాయికి ఎదిగామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలో అన్ని వర్గాలకు న్యాయం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలంకు రాజకీయ సమాధి తప్పదన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కుప్పంరూరల్: చేపల వేటకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కుప్పం మండలం, నూలుకుంట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. నూలుకుంట గ్రామానికి చెందిన రెహమాన్ (44) చేపలు పట్టడం అతనికి సరదా. మంగళవారం చేపలు పట్టేందుకు గ్రామం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. చెరువులో వల వేసి వలను లాగేందుకు చెరువులో దిగిన ఈతరాని రెహ్మాన్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. గమనించిన స్థానికులు, గ్రామస్తులు ఈతగాళ్ల సాయంతో మంగళవారం సాయంత్రం చెరువు నుంచి రెహ్మాన్ మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

SRI VENKATESWARA VETERINARY UNIVERSITY
COLLEGE OF VETERINARY SCIENCE, TIRUPATI

Lr.No.2926/Admn.IV/S.V.Feed Plant Operated by SVVU, Tirupati/2023, Dated: 30.01.2024

TENDER NOTICE

The SVVU, CVSc, Tirupati has invited e-Tender with ID: 715028 through AP e-Procurement for suply of "Feed ingredients" to S.V.Feed Plant operated by SVVU, Tirupati with last date : 21.02.2024. For more details visit website: www.apeprocurement.gov.in and www.svvu.edu.in

Contact No: 9989049932, 9849864777, CVSc, Tirupati

Sd/- P.Jagapathi Ramayya
Associate Dean

వైఎస్సార్‌సీపీలో భారీగా నియామకాలు

- జిల్లాలో 13 అనుబంధ విభాగాల నూతన కమిటీ ఏర్పాటు
- మొత్తం 217 మందికి పదవులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా పార్టీ అనుబంధ విభాగాల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ విభాగంలో వివిధ హోదాల్లో 18 మందికి చోటు కల్పించారు. ఆ విభాగ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా వై.వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా సి.కలప్ప, పి.భారతి నియమితులయ్యారు. అదే విధంగా జిల్లా ఎస్టీ విభాగంలో 15 మందికి చోటు కల్పించగా, జిల్లా అధ్యక్షుడిగా ఎం.నాగభూషణంనాయక్, జనరల్ సెక్రటరీలుగా ఎం.రామ్‌నాయక్, చిరంజీవి, బాలాజీ ఉన్నారు. జిల్లా బీసీ సెల్‌లో 19 మందికి చోటు కల్పించగా అధ్యక్షుడిగా ఎం.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడిగా ఎస్.సెల్వరాజ్ ఉన్నారు. క్రిస్టియన్ సెల్‌లో 30 మందిని నియమించగా అధ్యక్షుడిగా కే.జాషువా, ఉపాధ్యక్షులుగా కే.ధనరాజ్, ఈ.రమేష్, కల్చరల్ విభాగంలో 13 మందికి చోటు కల్పించగా అధ్యక్షుడిగా డి.రేణుక, జనరల్ సెక్రటరీగా ఎం.సోమశేఖర్, కేవీ.ఆనంద్‌ను నియమించారు. డాక్టర్ విభాగంలో 13 మందికి చోటు కల్పించగా అధ్యక్షుడిగా డాక్టర్ సుధీర్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ శరన్‌కుమార్, విద్యార్థి విభాగంలో 21 మందిని నియమించగా అధ్యక్షుడిగా జీవీ.రవి, ఉపాధ్యక్షులుగా ఎ.పవన్‌కుమార్‌యాదవ్, అశ్వర్థరెడ్డి ఉన్నారు. వాణిజ్య విభాగంలో 14 మందిని నియమించగా అధ్యక్షుడిగా ఎన్.నాగరాజ, జనరల్ సెక్రటరీగా ఆర్.ఉమాశంకర్, బీవీ.దేవరాజు, ఏసీ రాజశేఖర్‌రెడ్డి, సింగరం ఉన్నారు. దివ్యాంగుల విభాగంలో 8 మందికి చోటు కల్పించగా అధ్యక్షుడిగా ఎం.హరీష్‌బాబు, జనరల్ సెక్రటరీగా ఎస్.వెంకటేష్, ఎన్.శ్రీనివాసులు, చేనేత విభాగంలో 8 మందిని నియమించగా అధ్యక్షుడిగా ఈవీ.కన్నాయిరం, జనరల్ సెక్రటరీగా పి.కృష్ణయ్య, యువజన విభాగంలో 35 మందిని నియమించగా అధ్యక్షుడిగా పి.హేమంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.మహేంద్ర, డి.మురళీరెడ్డి ఉన్నారు. సేవాదళ్‌లో 17 మందిని నియమించగా అధ్యక్షులుగా ఎ.కిషోర్‌కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎస్.ఈశ్వరయ్య(రాజు), బి.బంగారునాయక్. ఎస్.బాలసుబ్రమణ్యం, కే.వెంకటేష్, వైఎస్సార్‌టీయూసీలో 6 మందికి చోటు కల్పించగా అధ్యక్షుడిగా జె.రఘురాంరెడ్డి, జనరల్ సెక్రటరీగా పి.వెంకటరమణను నియమించారు.

నేడు జిల్లా స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



జిల్లాస్థాయి పోటీలు జరిగే మెసానికల్ మైదానం

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు జిల్లా స్థాయికి చేరుకున్నాయి. గ్రామస్థాయి నుంచి జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా గెలుపు ఓటములు ఆశించకుండా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో పూర్తి అయిన ఈ పోటీలు ఈ నెల 31న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి బుధవారం క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు పాల్గొననున్నారు. ఈ పోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు క్రీడాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాకేంద్రంలోని మెసానికల్ మైదానం, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో ఐదు క్రీడల్లో గెలుపొందిన టీంలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. మొత్తం 35 టీంల క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో తలబడనున్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు మెసానికల్ మైదానంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహించనున్నారు. మొదటిరోజు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు సంబంధించి 21 టీంల మ్యాచ్‌లు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. 1, 2 తేదీల్లో క్రికెట్, 3వ తేదీన జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి


మాట్లాడుతున్న డీవీఈఓ సయ్యద్‌మౌలా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో పర్యావరణ, నైతిక, విలువల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్‌మౌలా ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో ఆయా స్కూళ్ల ప్రిన్సిపల్స్‌తో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 2న నైతిక, మానవ విలువలు, ఫిబ్రవరి 3న పర్యావరణ విద్య పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పరీక్షలు నిర్వహించని కళాశాలలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రశ్నపత్రం ఆయా కళాశాలల ఇంటర్మీడియట్ జ్ఞానభూమి లాగిన్‌లో ఉంటుందన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత సమీపంలోని కళాశాలల అధ్యాపకుల చేత మూల్యాంకనం జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహించిన అదేరోజు విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జవాబు పత్రాలను పీసీఆర్ కళాశాలలో ఉన్న డీవీఈఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. సమావేశంలో పరీక్ష కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యం, సుబ్రహ్మణ్యం రాజు, దయానందరాజు, హేమలత, మురళీకృష్ణ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వివాదమైన సినిమా షూటింగ్

తిరుపతి క్రైమ్: ఆధ్యాత్మిక నగరంలో తాజాగా ధనుష్, శేఖర్ కమ్ముల కాంబినేషన్లో సినిమా తెరకెక్కుతోంది. ఇదే సినిమాలో అక్కినేని నాగార్జున ప్రత్యేక పాత్రలో పోషించారని చెప్తున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. అయితే ఈ సినిమా రెండు రోజుల షెడ్యూల్ తిరుపతిలో జరిపే విధంగా చిత్ర బృందం ముందస్తు అనుమతులు తీసుకుంది. మంగళవారం ఉదయం అలిపిరిలో షూటింగ్ చేపట్టగా..భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ సమస్యని క్లియర్ చేశా రు. అయితే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు శ్రీ గోవిందరాజ స్వామి ఆలయం వద్ద షూటింగ్ నిర్వహించారు. అదే క్రమంలో ఓ మీడియా ప్రతినిధిపై చిత్ర బృంద్రం దాడికి యత్నించింది. దీంతో మీడియా ప్రతినిధులు పో లీసులకు ఫిర్యాదు చేశారు. కెమెరామన్ పురు షో త్తం తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆ శ్రయించారు. ట్రాఫిక్, భక్తుల సమస్య నేపథ్యంలో చిత్ర బృందం షూటింగ్‌కు ఇచ్చిన అనుమతులు పోలీస్‌శాఖ రద్దు చేసినట్టు సమాచారం.

గ్రీన్‌మాస్టర్‌కు జాతీయ స్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకట సిద్దులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ స్థాయిలో ఉత్తమ హరిత పాఠశాలగా ఎంపికైంది. ఇందుకుగానూ కృషి చేసిన గ్రీన్ మాస్టర్ వెంకట సిద్దులుకు ఉత్తమ గ్రీన్‌మాస్టరు అవార్డు దక్కింది. మంగళవారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటల్ సెంటర్‌లో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్ సునీత నరైన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. వరుసగా మూడోసారి ఈ పాఠశాల జాతీయస్థాయిలో ఉత్తమ హరిత పాఠశాలగా ఎంపిక కావడంతో ఉత్తమ గ్రీన్‌మాస్టరుగా వెంకటసిద్దులకు అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

గిరిజనులకు ప్రభుత్వ భూములు


షికారిపాళ్యెం గిరిజనులతో చర్చిస్తున్న డీఎఫ్‌ఓ చైతన్యకుమార్

పుంగనూరు: అటవీప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులను అన్నివిధాలా ఆదుకునేందుకు ఆర్‌ఓఎఫ్ఆర్ చట్టం కింద ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీఎఫ్ఓ చైతన్యకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని షికారిపాళ్యెంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మూర్తి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి గిరిజన కుటుంబీకులతో సమావేశం నిర్వహించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గిరిజనుల కుటుంబాలకు ఇంటి స్థలాలు, భూమి కేటాయించేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు తమ సంప్రదాయ వృత్తులతో పాటు వ్యవసాయం, వ్యాపారంలో రాణించాలని ఈ మేరకు అవగాహన కల్పించారు. అలాగే గిరిజనుల పిల్లలను సమీపంలోని పాఠశాలల్లో చదివించాలన్నారు. వీరికి అవసరమైన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ బాలకృష్ణారెడ్డి, వీఆర్ఓ అక్బర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాగానిపల్లి బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా వెంపర్లాట..
చివరికి దుకాణం వద్దే దొరికాడట

- రెండు నెలలుగా కుదువ వ్యాపార దుకాణానికి తాళం
- గగ్గోలు పడిన బంగారం, వెండి నగలు తాకట్టు పెట్టిన బాధితులు
- అర్ధరాత్రి దుకాణం తెరుస్తుండగా పోలీసులకు చిక్కిన యజమాని
- కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు



యాదమరి: కుదువ వ్యాపారం దుకాణాన్ని తెరుస్తున్న పోలీసులు

యాదమరి: మండల కేంద్రంలో జ్యువెలరీ, కుదువ వ్యాపారం దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి గత రెండు నెలలుగా షాపు తెరవట్లేదు. దీంతో అతని వద్ద బంగారం, వెండి నగలను తాకట్టు పెట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు. అయితే సోమవారం అర్ధరాత్రి సదరు దుకాణ యజమాని షాపులో ఉన్న నగలను తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో రాత్రివేళ గస్తీలో ఉన్న పోలీసులు అతన్ని ప్రశ్నించారు. దీంతో పూటుగా మద్యం సేవించి ఉన్న వ్యాపారి, ఈ దుకాణం తనదే అని, ఎందుకు అడుగుతున్నారని ఎదురు ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అక్కడ తమదైన శైలిలో ప్రశ్నించే సరికి అసలు విషయం బయట పడింది. వివరాలు ఇలా.. మండల కేంద్రమైన యాదమరిలో రాజస్థాన్‌కు చెందిన మధు అనే వ్యక్తి శ్రీకృష్ణ జ్యువెలర్స్, కుదువ వ్యాపారం దుకాణాన్ని గత 4 ఏళ్లుగా నడుపుతున్నాడు. మండలంలోని ప్రజలు, రైతుల బంగారం, వెండి నగలను కుదువ పెట్టుకుని వడ్డీకి డబ్బులు ఇచ్చేవాడు. అయితే గత రెండు నెలలుగా దుకాణానికి తాళాలు వేశాడు. విషయం తెలిసి బంగారం కుదువ పెట్టిన బాధితులు నిత్యం దుకాణం వద్దకు తిరిగారు. ఇంటి వద్దకు వెళ్లి ఆరా తీయగా సదరు వ్యాపారి మధు రాజస్థాన్‌కు వెళ్లాడని చెప్పడంతో బాధితులు వెంటనే పోలీసులు ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దుకాణ యజమాని బంధువులను విచారించారు.

వెండి తీసుకెళ్లడానికి వచ్చి ..

రెండు నెలలుగా తాళం వేసి రాజస్థాన్‌కు వెళ్లిన కుదువ వ్యాపారి మధు సోమవారం అర్ధరాత్రి తన దుకాణంలో ఉన్న వెండిని తీసుకెళ్లడానికి వచ్చి పోలీసులకు చిక్కాడు. మద్యం మత్తులో తన దుకాణం తీయడానికి ప్రయత్నిస్తుండగా రాత్రి గస్తీలో ఉన్న పోలీసులు పట్టుకున్నారు. విచారణలో అసలు విషయం బయట పడింది. అయితే సదరు కుదువవ్యాపారి పోలీసుల అదుపులో ఉన్నాడని బాధితులకు తెలియడంతో వారంతా అక్కడికి చేరుకుని పోలీసుల వద్ద తమ గోడు చెప్పుకున్నారు.

వేలూరు, గుడియాత్తంలో నగలు తాకట్టు..

మండలంలోని ప్రజలు, రైతులు పెట్టిన బంగారం నగలను కుదువ వ్యాపారి సమీప బంధువులు వేలూరు, గుడియాత్తంలోని సేట్‌ల వద్ద తాకట్టు పెట్టి నగదు తీసుకున్నట్లు గుర్తించామని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 3 కిలోల బంగారం నగలు, 10 కిలోల వెండి తాకట్టుకు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఇంకా బాధితులు ఇచ్చే ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేస్తామన్నారు. అలాగే సదరు దుకాణాన్ని యజమాని మధు ఆధ్వర్యంలో తెరిచి అందులో ఉన్న నగలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే మండల పరిధిలో పలువురి వద్ద చీటీలు వేసి నగదు తీసుకెళ్లాడని, వడ్డీకి రూ.లక్షల్లో అప్పు తీసుకున్నట్లు ఫిర్యాదులు రావడంతో విచారిస్తున్నామని, ఇప్పటికే కేసు నమోదు చేశామన్నారు.

నెమలిని రక్షించిన రైతు


గాయపడిన నెమలిని ఎఫ్‌ఎస్‌ఓకు అప్పగిస్తున్న రైతు

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లెలో మంగళవారం అటవీ ప్రాంతం నుంచి ఓ నెమలి మామిడితోటలోకి వచ్చింది. ఊరకుక్కలు నెమలిపై దాడి చేయడంతో రెక్క దగ్గర గాయమైంది. అయితే అక్కడే పనిచేస్తున్న రైతు సురేంద్రనాయుడు నెమలిని రక్షించి అటవీశాఖ సెక్షన్ అధికారి శివకుమార్‌కు సమాచారం అందించారు. వారు రైతు నుంచి నెమలిని స్వాధీనం చేసుకుని, అనంతరం చికిత్స కోసం చిత్తూరు పశువైద్యశాలకు తరలించారు. అలాగే నెమలిని జిల్లా ఉన్నతాధికారులకు అప్పగించారు.

స్టాండర్డ్స్..లేబులింగ్‌తో శక్తి ఆదా

ఏర్పేడు : స్టాండర్డ్స్, లేబులింగ్ ద్వారా శక్తిని ఆదా చేయవచ్చని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం), సిరి ఎక్సర్జీ సహకారంతో ప్రమాణాలు, లేబులింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ శక్తి ఆదా ప్రాముఖ్యత, ఎలక్ట్రికల్ ఉపకరణాల ప్రమాణాలు, లేబులింగ్‌పై అవగాహన, జ్ఞానాన్ని అందించడం లక్ష్యంగా ఇ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించా రు. వివిధ రంగాల్లో ఇంధనం–సమర్థవంతమైన పద్ధతులు, సాంకేతికత అవలంబించాల్సి అవసరాలను తెలిపారు. కార్యక్రమానికి సుమారు 220 మంది విద్యార్థులతోపాటు ఏపీఎస్ఈసీ నిపుణు లు మధు,దామోదర్,సుబ్రమణ్యంహాజరయ్యారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ ఉచిత శిక్షణ మరియు ఉపాధి అవకాశాలు గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు నాలుగు నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన సర్టిఫికెట్, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar Skill Education, Kadapa. Ph: 9063082227, 9966448807

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate

BUILDING FOR SALE
■ శ్రీ కాళహస్తి, పానగల్లు NTR పార్క్ ఎదురుగా 501 చ॥గ లలో నిర్మించిన 3 అంతస్తుల భవనం రూ. 4,20,00,000/- గా నిర్ణయించి బ్యాంక్ వేలం నందు అమ్మబడును. ఫోన్ : 98496 36969

FLATS FOR SALE
■ 3 BHK (2200 Sqft) Flats for Sale, K.T.Road (Opp. HDFC Bank), 25,000 Sqft Commercial Space Rent/Lease Doddapuram Street, ✆ 6303133781, 7799570080.

PLOT FOR SALE
■ శ్రీ కాళహస్తి, తొట్టంబేడు, చెన్నై NH దగ్గర Plot నెం. 12 & 24 లో గల 177 & 132 చ॥లు రూ. 32 & 24 లక్షల కనీసధరగా బ్యాంక్ వేలం నందు అమ్మబడును. ఫోన్ : 98496 36969

BUSINESS SERVICE



BUSINESS OFFER
■ స్త్రీ/పు. చిన్న పెట్టుబడితో ప్రాఫిట్ షేరింగ్ బిజినెస్ ద్వారా ప్రతి నెల 50,000/- ఆ పైన ఫిక్స్‌డ్ సంపాదన పొందండి. 7013208996, 7981283806

Wanted

■ Wanted Tele Callers and Marketing Executives. Contact Cell: 9133305005.

■ తిరుపతి, కొర్లగుంటలోని టైలరింగ్ కంపెనీలో పనిచేయుటకు టైలర్లు మరియు ప్యాకింగ్ కోసం మహిళలు కావలెను. సంప్ర: 9246991550.

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావ లెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీపేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 91777 36926

■ మేనకూరు, అత్తివరం పరిసర ప్రాంతాలలో పని చేయుటకు అనుభవం ఉన్న ASO, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం॥ల డ్యూటీ, జీతం+PF, ESI కలదు. సంప్ర:81425 42121.

■ విజయవాడలో ఇంటివద్దనే వుండి పేషెంట్లను /పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం వున్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం + మంచి జీతం ✆ 91608 35559, 78158 35561

■ కస్టమర్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000, ఫ్రీ రూమ్+భోజనం, HYD, ఫోన్ 7993580999.

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9579888520, 9059688520.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ... ఈ విషయాన్ని గమనించగలరు.